


29న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 29వతేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.



మున్సిపల్ కార్యాలయం

ఊరూ.. వాడా.. 'బెల్టు'..!



విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపుల ఏర్పాటు - ఒక్కో షాపునకు రూ.లక్ష వసూలు

వీటి కేటాయింపు కూడా ఎంఎల్ఎలు, స్థానిక నేతల కనుసన్నల్లోనే

ఒక్కో గ్రామంలో కనీసంగా నాలుగైదు బెల్టు షాపులు

ప్రేక్షకపాత్రలో ఎక్సైజ్ అధికారులు - ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం అమ్మకాలకు గేట్లు ఎత్తేశారు. ఒక అధికారిక దుకాణం పరిధిలో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు వెలిసిపోతున్నాయి. దీంతో రెండు జిల్లాల్లోనూ మద్యం ఏరులై పారే పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మద్యంతోపాటు నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగగా, కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ మద్యం అన్నట్లు పరిస్థితి తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ తీరుపై జనాల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, ఇప్పుడు ప్రయివేటుకు అప్పగించారు. ఈ నెల 16వ తేదీ నుంచి కొత్త షాపుల్లో మద్యం అమ్మకాలు ప్రారంభమయ్యాయి. కొత్తగా మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంది. దీంతో పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతోపాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. ప్రభుత్వం లాటరీ ద్వారా కేటాయించిన మద్యం దుకాణ పరిధిలో పెద్దఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్న పరిస్థితి కన్పిస్తోంది.

బెల్టుషాపునకు రూ.లక్ష వసూలు

గ్రామాల్లో ప్రాంతాలవారీగా ఈ బెల్టు షాపులు ఏర్పాటు చేస్తున్నారు. బెల్టుషాపులకు సైతం పెద్దఎత్తున పోటీ సాగుతోంది. ఎంఎల్ఎ, స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ ప్రక్రియ సాగుతోంది. బెల్టుషాపు ఎవరికివ్వాలో ప్రజాప్రతినిధులే నిర్ణయిస్తున్న పరిస్థితి ఉంది. బెల్టుషాపు కేటాయించిన వారినుంచి రూ.లక్ష వసూలు చేస్తున్నారు. ఒక అధికారిక మద్యం దుకాణం పరిధిలో తక్కువగా లెక్కించినా 20కుపైగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసిన వ్యక్తులు క్వార్టర్ బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 అదనంగా ధర వసూలు చేసేందుకు నిర్ణయించారు. వీరికి ముందుగా 40 నుంచి 50 వరకూ మద్యం బాటిల్స్ ఇస్తున్నారు. అమ్మకాలను బట్టి బాటిల్స్ అందించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంతోపాటు జనసేన ప్రజాప్రతినిధులు ఉన్నచోట్ల ఈ బెల్టుషాపుల ఏర్పాటు విషయంలో టిడిపి, జనసేన నేతల మధ్య రాజకీయ పోరు సాగుతుండటం విశేషం. బెల్టు షాపుల ఏర్పాటుతో మద్యం ప్రతి వీధికీ, ప్రతి పేటకు చేరుతున్న పరిస్థితి ఉంది. జనాలను తాగుబోతులుగా మార్చే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తోంది. బెల్టు దుకాణాల ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వ్యక్తికి తక్కువగా లెక్కించినా రూ.కోటి వరకూ ఖర్చవుతుందని, సొమ్ము రాబట్టుకోవాలంటే బెల్టుషాపులు తప్పనిసరని ప్రజాప్రతినిధులు మాట్లాడుతుండటం గమనార్హం. 2014-19 టిడిపి ప్రభుత్వ హయంలోనూ మద్యం బెల్టుషాపులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అప్పట్లో ప్రతిపక్ష వైసిపి బెల్టు షాపులను ఆయుధంగా చేసుకుని ప్రచారం చేసింది. 2019 ఎన్నికల్లో టిడిపి ఓటమికి మద్యం బెల్టుషాపులు ముఖ్యకారణంగా చెప్పొచ్చు. మళ్లీ ఇప్పుడు సైతం అదే తరహాలో కూటమి ప్రభుత్వం బెల్టుషాపులను ప్రోత్సహిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరోగ్యశ్రీ సొమ్ము ఎగ్గొట్టిన జగన్

మంత్రి నిమ్మల ఆరోపణ

ప్రజాశక్తి - పాలకొల్లు

గత జగన్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా ఎగ్గొట్టిందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం సిఎం సహాయ నిధి నుంచి 11 మంది పేదలకు రూ.3.20 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేద, మధ్యతరగతి ప్రజలకు బిల్లులు చెల్లించకపోగా జగన్ మానవత్వం కూడా లేకుండా మెమో కూడా ఇచ్చారన్నారు. జగన్ పాలనలో ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న పేదలు, మధ్యతరగతి ప్రజలు వైద్యానికి సొంత సొమ్ము చెల్లించాల్సి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వంలో దానికి భిన్నంగా నిరుపేద రోగుల వైద్యానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రెండు డయాలిసిస్ కేంద్రాలు మంజూరయ్యాయని, వాటిలో ఒకటి పాలకొల్లుకు మంజూరైందని తెలిపారు. తన హయాంలో ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలుగా చేయడానికి రూ.12.5 కోట్లు మంజూరు చేయించానన్నారు. గత ఐదేళ్లలో దాని నిర్మాణం పూర్తి చేయలేదని చెప్పారు. ఇష్టానుసారం పనులు చేయడంతో గత నాలుగు నెలలుగా మరమ్మతులు చేయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: ధన దాహానికి తల్లిని, చెల్లిని కోర్టుకీడ్చిన జగన్‌కు రాజకీయాల్లో ఉండే అర్హత లేదని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన ఆదివారం నియోజకవర్గంలోని ఆగర్తిపాలెం, ఇతర గ్రామాల్లో రూ.కోటి 13 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. జగన్ ఐదేళ్ల పాలనలో పంచాయతీల్లో చిల్లిగవ్వలేక కనీసం ముగ్గు చల్లడం, చెత్త ఎత్తడం, ఫిల్టర్ బెడ్‌లో ఇసుక మార్పిడి వంటి పనులు సైతం చేపట్టని పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమాల్లో హౌసింగ్ డిఇ త్రిమూర్తులు, ఎఇ శ్రీనివాస్, పంచాయతీరాజ్ డిఇ స్వామి, ఎఇ వి.శ్యాంబాబు, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ శ్రీనివాసు, ఎఇ రమణ, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, సర్పంచి కావలి సూర్యకుమారి, జెడ్‌పిటిసి చిట్టూరి కనకలక్ష్మి, నేతలు కోడి విజయభాస్కర్, పాముల రజిని కుమార్, రాయి ప్రసాద్, సహదేవుడు, రాచమల్ల మీరయ్య, అందెకోటి వీరభద్రం పాల్గొన్నారు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురంలో ఎంత సనిచేసావ్ చంటి చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణం కనకదుర్గా థియేటర్ వద్ద ఆదివారం 'ఎంత పనిచేసావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రయూనిట్ అభిమానులతో కలిసి ఆదివారం మార్నింగ్ షో చూసారు. అనంతరం అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా హీరో ఉలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సినిమాలో నటించాలన్నది తన చిన్ననాటి కల అన్నారు. మెగాస్టార్ చిరంజీవిని ఆదర్శంగా తీసుకుని ఇండస్ట్రీలోకి అడుగుపెట్టామన్నారు. మొదటి సినిమాతోనే సక్సెస్ సాధించడం సంతోషంగా ఉందన్నారు. హీరో శ్రీనివాస్, హీరోయిన్ నిహారిక, డైరెక్టర్ ఉదయ్‌కుమార్‌లతో అభిమానులు ఫొటోలు దిగారు. హీరో నరసాపురం మండలం వేములదీవి గ్రామం సర్దుకొడప గ్రామానికి చెందిన వ్యక్తి కావడంతో సినిమా హాల్ వద్ద సందడి నెలకొంది. కోపల్లి శ్రీనివాస్, చెన్నంశెట్టి నాగు, పొలిశెట్టి సాంబ, పులపర్తి ప్రతాప్, కూనపురెడ్డి రామకృష్ణ పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న చిత్ర యూనిట్

మంతెన వెంకటపతిరాజు చరితం.. భావితరాలకు పదిలం

దాతృత్వానికి నిదర్శనం

ఆయన జీవితం ఆదర్శప్రాయం



మంతెన దుర్గరాజు, రాజయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్

ప్రజాశక్తి - కాళ్ల

దాతృత్వానికి నిదర్శనం, మానవత్వానికి మారుపేరు మంతెన వెంకటపతిరాజు. ఆయన జీవితం ఎందరికో ఆదర్శం. భావితరాలకు స్ఫూర్తిదాయకం. సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి ఎందరో ప్రముఖులు, వ్యక్తులు, సంస్థలు, ట్రస్టులు కృషి చేస్తున్నాయి. కుల, మత, ప్రాంతీయ బేధాలకు అతీతంగా సేవాభావంతో పనిచేసేవారు ఇంకొందరు ఉన్నారు. అణగారిన, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నేటికీ కటిక దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. పేదరికం, కుటుంబ జీవనంలో అనేక వ్యయ, ప్రయాసలతో నానా ఇబ్బందులు పడుతున్న వారు సమాజంలో ఎందరో ఉన్నారు. ఇలాంటి వారి కోసం అనేక సేవా సంస్థలు ఆపన్న హస్తం ఇస్తూ ఏదో ఒక రూపంలో సాయం చేస్తూ ఆదుకుంటున్నాయి.

ఆనాడు మనదేశం బ్రిటీష్ వారి పాలనలో ఉండడంతో సమాజం పరపీడనలో అభివృద్ధికి, అభ్యుదయానికి దూరంగా మగ్గుతున్న రోజులవి. కోపల్లె గ్రామం కేంద్ర బిందువుగా సాగిన ఉదాదత్త చరిత్రకు అక్షర రూపం. అన్ని దానధర్మాలలోనూ దానగుణం అత్యంత ఉత్తమమైంది. దానిని మనస్ఫూర్తిగా మంతెన వెంకటపతి రాజు అనుసరించారు. ముందుచూపు, ఔదార్యం, దాతృత్వంతో సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నారు. మంతెన వెంకటపతి రాజు మనవడు మంతెన రామ్‌కుమార్ తాత ఆశయాలను నేటికీ కొనసాగిస్తున్నారు. మంతెన వెంకటపతి రాజు జీవిత చరిత్ర నేటి తరాలకు ఒక చక్కటి ప్రేరణగా నిలుస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు.

కుటుంబ నేపథ్యం : మండలంలోని కోపల్లె గ్రామంలో ఆయన మంతెన దుర్గారాజు, రాజయమ్మ దంపతులకు 1908లో జన్మించారు. మంతెన వెంకటపతి రాజు హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులై భాషా జ్ఞానాన్ని పెంపొందించుకున్నారు. ఇంగ్లీష్ భాషా నైపుణ్యానికి శిక్షణ పొందారు. వ్యవసాయ, పశుగణాభివృద్ధి, చిన్నతరహా నీటిపారుదల విషయాల్లో శిక్షణ పొందారు.

సేవే పరమావధి : గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రకృతి వైద్యం, పశువైద్యానికి కావాల్సిన వనరులు కూడా వ్యక్తిగతంగా సమకూర్చడమే కాకుండా దేవాలయాలు, వైద్యశాల, వసతి పాఠశాలల నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించారు. కృషి, పట్టుదల, కార్యసాధన, సహకారం, దాతృత్వం మొదలైన ఉత్తమ లక్షణాలతో పలు కార్యక్రమాలను కార్యదీక్షతో చేపట్టారు. ఆయన పెంచిన విద్యా ఉద్యానవనంలో అంకురించిన విద్యా కుసుమాలు ఎన్నో, మరెన్నో కుటుంబాల్లో వెలుగు రేఖల్ని నింపుతూ వస్తున్నాయి.



వెంకటపతిరాజు (ఫైల్ ఫొటో)

చెక్కుచెదరని మూడంతస్తుల మేడ : 1912లో కోపల్లె గ్రామంలో అల్లూరి వెంకటరాజు, సూరయమ్మలు నిర్మించిన ఇంటిని 1951లో మార్పుచేసి మంతెన వెంకటపతి రాజు మూడంతస్తుల మేడను నిర్మించారు. శతాబ్దంపైబడిన చెక్కు చెదరని భవనం చూపరులను ఆకట్టుకుంటున్నది.

తల్లిదండ్రుల పేర్లుతో రెండు హైస్కూళ్లు : కోపల్లె గ్రామంలో హైస్కూలు చిన్నగా ఉండేది. ఆ తర్వాత విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా 1950లో హై స్కూల్‌ను స్థాపించిన తీరు, ఎంతో ముందు చూపుతో చేసిన వైనం ఎప్పటికీ చరిత్రలో నిలిచిపోతుంది. ఉన్నత పాఠశాల సౌకర్యం కేవలం కోపల్లె గ్రామానికి పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు కూడా సౌకర్యంగా ఉండే విధంగా రోడ్డుకు దగ్గరగా దార్శనికులు స్థాపించారు. అప్పుడే నూతనంగా జువ్వలపాలెం రోడ్డులో జక్కరం వంతెన వద్ద నాలుగు ఎకరాల విశాల ప్రాంగణంలో విశాలమైన భవనాన్ని, పై అంతస్తు నిర్మాణ పనులను మంతెన వెంకటపతి రాజు చేపట్టారు. మంతెన వెంకటపతిరాజు తల్లిదండ్రులు మంతెన దుర్గరాజు, రాజయమ్మ జిల్లా పరిషత్ హైస్కూల్‌గా నామకరణ చేశారు.

ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామంలో తండ్రి పేరుతో మంతెన దుర్గరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను స్థాపించి తాను పుట్టిన గ్రామ రుణం తీర్చుకున్నారు. కోపల్లె వారి సత్రంలో పేద విద్యార్థులకు అందించే సహకారం వెనుక వెంకటపతి రాజు కృషి ఎంతో ఉంది. భీమవరం డిఎన్ఆర్ కాలేజీకి వారి వితరణ ఉంది. విద్యారంగంలో ఆయన చేసిన కృషి వల్ల ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడం మరుపురాని విషయం.

114 ఏళ్లుగా సేవలందిస్తున్న కోపల్లె వారి సత్రం : 1910లో దంతులూరి జోగి జగన్నాథ రాజు కోరికపై భీమవరంలో స్థలం కొనుగోలు చేసి ఒక సత్రాన్ని మంతెన దుర్గరాజు నిర్మించారు. ఆ సత్రాన్ని అందరూ కోపల్లె వారి సత్రంగా ఈనాటికీ పిలుస్తారు. ఆ సత్రం పేరు దంతులూరి జోగి జగన్నాథరాజు సత్రం. ఆ సంస్థ యొక్క ముఖ్య ఆశయం పేద విద్యార్థులకు భోజన వసతి కల్పించడం, వివాహాది శుభకార్యములకు వసతి ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఆనాటి ఆశయాన్ని నేడు క్రమం తప్పకుండా మంతెనవెంకటపతి రాజు మనవడు మంతెన రాంకుమార్ రాజు కొనసాగిస్తున్నారు.

సహకార బ్యాంకు వ్యవస్థాపకులు : కోపల్లె గ్రామంలో సహకార బ్యాంకు వ్యవస్థాపకులుగా వీరి వితరణ, సేవ ప్రశంసనీయం. సొసైటీ మొట్టమొదటి అధ్యక్షులుగా మంతెన వెంకటపతి రాజు 1956లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1956లో మంతెన వెంకటపతిరాజు 20 మంది సభ్యులతో సొసైటీని ఏర్పాటు చేశారు. 67 ఏళ్ల నుంచి ఈ బ్యాంకు ప్రగతి బాటలో పయనిస్తూ, ప్రజాసేవలో పునీతమవుతోంది. బ్యాంకు వ్యవస్థాపకుల స్ఫూర్తి అడుగడుగునా మూర్తీభవిస్తూ, బాధ్యతాయుతమైన నేపథ్యంలో అంకితభావం, క్రమశిక్షణ కలిగిన సిబ్బంది, ఛైర్మన్ల తోడ్పాటుతో సొసైటీ పురోగమిస్తోంది. కోపల్లె, వేంపాడు, చినఅమిరం, పెదఅమిరం, జక్కరం, సీసలి, బొండాడ, బొండాడ పేట, లక్ష్మీ నరసింహపురం, ఆనందపురం, మాలవానితిప్ప 11 గ్రామాల్లో రైతులకు, ప్రజలకు సేవలు అందిస్తోంది.

పలు విరాళాలు : 1946లో ఇలాంటి డబ్ల్యూజిబి కాలేజ్(ఈనాడు డిఎన్ఆర్ కళాశాల) ప్రారంభ దశలో భారీ విరాళం అందించారు. కాళ్ల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవన నిర్మాణ నిమిత్తం విరాళం అందించారు. భీమవరంలో ఆగస్టాన మిషన్ ఆస్పత్రికి ఆర్థికసాయం అందించారు. భీమవరంలోని రామకృష్ణ ప్రకృతి ఆశ్రమ వ్యవస్థాపనలో వీరి పాత్ర ఆర్థిక, హార్దికంగా చిరస్మరణీయం. కోపల్లె గ్రామంలో పశువైద్యశాల నిర్మాణం చేపట్టారు.

వెంకటపతిరాజు విగ్రహం ఏర్పాటు..

మంతెన వెంకటపతి రాజు 1969లో మృతిచెందారు. మంతెన వెంకటపతి రాజు మనవడు, దత్తుడు మంతెన రామ్‌కుమార్‌రాజు 2000లో కోపల్లె హైస్కూల్లో మంతెన వెంకటపతిరాజు విగ్రహాన్ని అప్పటి పార్లమెంట్ సభ్యులు కనుమూరి బాపిరాజు ఆవిష్కరించారు.

తాత ఆశయాలను కొనసాగిస్తున్నాం

కోపల్లె వారి సత్రం వంశపారంపర్య ధర్మకర్త, ఛైర్మన్ మంతెన రామ్‌కుమార్

సమాజ శ్రేయస్సే ధ్యేయంగా వివిధ సంస్థలకు, విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ఆటు సహకార రంగానికి, భూదానోద్యమానికి, పశువైద్యానికి, ఇటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇతోధికమైన ఆర్థిక, సహాయ సహకారాలు అందించిన వితరణ గుణ సంపన్నులు తాత మంతెన వెంకటపతిరాజు. తాత మంతెన వెంకటపతిరాజు ఆశయాలను కొనసాగిస్తున్నాం. గత 14 సంవత్సరాల నుంచి వంశపారంపర్య ధర్మకర్త, ఛైర్మన్‌గా పనిచేస్తున్నాను. జిల్లాలోనే పెద్ద సత్రం, ఎంతోమంది పేదలకు విద్యనందించిన మహాదాత మంతెన వెంకటపతిరాజు. ఉదయం, సాయంత్రం రెండుపూటలా విద్యార్థులకు రుచికరమైన భోజనాలు అందిస్తున్నాం. విద్యను ప్రోత్సహించాలనే దంతులూరి జగన్నాథరాజు ఆశయ సాధన కోసం సత్రంలో గత ఎనిమిదేళ్ల నుంచి పేద విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. ప్రభుత్వ మున్సిపల్ స్కూల్స్‌లో ప్రతిభ కలిగిన విద్యార్థులను మూడు గ్రేడులుగా విభజించి ప్రోత్సాహక బహుమతులు ఇస్తున్నాం. ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ధర్మకర్తల మండలి సభ్యుల సలహాలతో సంస్థను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నాం.

సంక్షోభంలో విద్యారంగం

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు



యుటిఎఫ్ స్వర్ణోత్సవ మండల మహాసభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

పాలకుల అసంబద్ధ నిర్ణయాలతో విద్యారంగం సంక్షోభం లోకి నెట్టబడుతోందని పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవి) అన్నారు. మండలంలోని కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్సవ మండల మహాసభకు బిఆర్ఎం.కోటేశ్వరస్వామి అధ్యక్షత వహించారు. తొలుత అమరజీవుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు చైతన్యవంతమైన బోధన ద్వారా విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దగలరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించమనే చెప్పే ధైర్యం ఉందా అని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యా రంగం అభివృద్ధి చెందేలా నేటి ప్రభుత్వం కృషి చేయడం లేదన్నారు. విద్యార్థుల చదువు కోసం రూపొందించిన పాఠ్యపుస్తకాలు ఉపాధ్యాయులకు అర్థం కాకపోతే విద్యార్థులకు ఏం అర్థమవుతాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. సెక్రటరీ, డైరెక్టర్ ముందుమాట రాస్తారని, అయితే లోపల ఏముందో చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులు ప్రశ్నించినా విద్యాశాఖ ఆర్‌జెడి, డిఇఒ పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యపుస్తకాలు రూపొందించాలని కోరారు. సబ్జెక్టును అర్థం చేసుకుని మార్కులు లేని చదువులు కావాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. ప్రశ్నించే గొంతుక కోసం టీచర్స్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తిని గెలిపించాలని కోరారు. మహాసభలో యుటిఎఫ్ సీనియర్ నాయకులను సత్కరించారు. పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ప్రతి హైస్కూల్ నుంచి స్కూల్ ఫస్టు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండల, జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన గురువులకు సన్మానం, స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి, రిటైర్డ్ ఎంఇఒ జి.కనకరాజు, ప్రధానోపాధ్యాయురాలు కె నిర్మలా దేవి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామ భద్రం, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామకృష్ణంరాజు, కె.సాయిరాం, కె.రామకృష్ణప్రసాద్, డి.ఏసుబాబు, కుమార్ బాబ్జి, రాష్ట్ర కౌన్సిలర్ జివి.రామానుజరావు, బి.రాజ్యలక్ష్మి, సిఐటియు నాయకులు గొర్ల రామకృష్ణ, అంగన్వాడీ నాయకులు మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

మండల నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా వివిఆర్‌కె.రవికుమార్‌రాజు, అధ్యక్షులుగా బిఆర్ఎంకె.స్వామి, సహాధ్యక్షులుగా పి.ప్రభుదాసు, సహాధ్యక్షురాలిగా కనకదుర్గ, ప్రధాన కార్యదర్శిగా ఎం.శంకర్రావు, కోశాధికారిగా ఎల్.అప్పలాచార్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి'



మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

104 వాహనాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. 104 వాహనాల్లో పని చేస్తున్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రతినెలా జీతాలు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టాలన్నీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 104 ఉద్యోగులకు అండగా సిఐటియు ఉంటుందన్నారు. రాష్ట్రంలో చిరుద్యోగులపై అధికారపక్ష వేధింపులు పెరిగాయని, వీటిని ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు వచ్చేలా రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ రానున్న కాలంలో ఐక్యంగా పోరాడాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు ఆర్ఎం.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వివిఎస్.సురేష్ మాట్లాడుతూ 104 ఉద్యోగులు ఐక్యంగా నిలబడాలని, గతంలో చేసిన ఆందోళనలు, పోరాటాలను గుర్తు చేశారు. 104 ఉద్యోగుల సీనియర్ నాయకుడు సుందర్‌సింగ్ మాట్లాడుతూ జిఒ 151 సాధించుకోవడం ద్వారా ఆనాడు 104లో ఉన్న ఉద్యోగులు మెడికల్ అండ్ హెల్త్‌లో కొనసాగుతున్నారన్నారు. జిఒ.7 ప్రకారం అందరికీ జీతాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని, దానికోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పి.రామకృష్ణ, సుదర్శన్, దివ్యవాణి మాట్లాడారు.

డయాబెటిక్ కిట్‌ల పంపిణీ అభినందనీయం

తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



కిట్‌లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

జిల్లాలోని 73 లయన్స్ క్లబ్‌లకు ఉచితంగా డయాబెటిక్ టెస్ట్ పరికరాలను పంపిణీ చేయడం అభినందనీయమని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా సేవలందిస్తున్న వావిలాల సరళాదేవిని ఎంఎల్ఎ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో వావిలాల సరళాదేవి ఆధ్వర్యంలో డయాబెటిక్ కిట్ల పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా 125 మందికి డయాబెటిక్ టెస్ట్ పరికరాలను ఒక కిట్‌గా చేసి ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం డయాబెటిక్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ వేణుబాబు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలకుగాను వావిలాల సరళాదేవిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ నాయకులు పాపారావు నాయుడు, గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ సుబ్బారావు, ఎం.శ్రీహరి, కొరిపల్లి సత్యనారాయణ, చీకటి శ్రీనివాస్, స్వర్ణ క్లబ్ అధ్యక్షులు శేషుబాబు, బూరుగుపల్లి వెంకట్రావు, దామెర సురేఖ, టిఎస్ పద్మావతి పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్లతో మోసం

వారిపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు శర్మ, ధనుష్

భీమవరం : పురోహిత, అర్చక సమాఖ్య పరీక్షల పేరిట నకిలీ సర్టిఫికెట్లతో అక్రమార్జనకు పాల్పడుతోన్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌విఎస్.శర్మ, జి.ధనుష్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ కమిషనర్ హరిజవహర్ లాల్ పనిచేస్తున్న కాలంలో ఆంధ్రప్రదేశ్ పురోహిత, అర్చక సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా ఉన్న యామిజాల నరసింహమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శనం దుర్గబాబులు రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని గ్రామాలు, పట్టణాలు, వివిధ ప్రాంతాల దేవాలయాలలో పనిచేస్తున్న అర్చకులకు, పురోహితులకు పరీక్షలు నిర్వహించారన్నారు. అర్హత పట్టాలు అందజేస్తామని ఆ పట్టాల ద్వారా పర్సనల్ లోన్లు, బ్యాంకు లోన్లు, విదేశాలకు పాస్ పోర్టులు, రైల్వే ప్రయాణాలకు రాయితీ టికెట్లు పొందవచ్చునంటూ రాష్ట్రంలోని అర్చక, పురోహిత విద్యార్థులను నమ్మించి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన తిరుమల తిరుపతి దేవస్థానం, విజయవాడ కనకదుర్గ దేవస్థానం, అన్నవరం దేవస్థానాల నకిలీ స్టాంపులు, ఆగమ, పరీక్షాధికారుల ఫోర్జరీ సంతకాలతో నకిలీ సర్టిఫికెట్లు తయారుచేసి ఆ సర్టిఫికెట్లతో వేలాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నారన్నారు. ఈనెల 28న భీమవరం ఆనంద్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఈ అర్చక, పురోహిత సమాఖ్య పరీక్షలలో రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి, స్థానిక భీమవరం, ఉండి ఎంఎల్ఎ, ఇతర ఆగమ పరీక్షాధికారులు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు పాల్గొంటున్నారని, పరీక్షలలో విజయం సాధించిన వారికి పట్టాలు, సర్టిఫికెట్లు ఇవ్వనున్నామని సామాజిక మాధ్యమాలలో వీడియోలతో యామిజాల నర్సింహమూర్తి, సుదర్శనం దుర్గబాబులు పలు రకాలుగా ప్రచారం నిర్వహించారన్నారు. పురోహిత, అర్చక విద్యార్థులను మోసగించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నకిలీ అర్చక పరీక్షలను రద్దుచేయాలని, అర్చక, పురోహిత విద్యార్థుల నుంచి అక్రమంగా వేలాది రూపాయల వసూళ్లకు పాల్పడుతోన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని, పరీక్షలను పారదర్శకంగా జరిపించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలి : సిపిఎం

భీమవరం టౌన్ : విద్యుత్ ఛార్జీల భారాలు ప్రజలపై వేయటాన్ని ఆపాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ యమునా పల్లిలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి, సర్దుబాటు ఇంధనం ఛార్జీలు రద్దుచేయాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటర్ కమిషన్ యూనిట్-1 రూ.90 పైసలుది 2.73 పైసలకు పెంచాలని నిర్ణయించడం సరైనది కాదన్నారు. 2022లో వాడుకున్న కరెంటుకి ఇప్పుడు మరలా సర్దుబాటు ట్రూ అఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయటం ఆపాలన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బుంగ కటాక్షరావు, కుచనపల్లి మోసే బుంగ భీముడు పాల్గొన్నారు.

అన్ని మతాలను గౌరవించాలి

కేంద్ర మంత్రి వర్మ, ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

కూటమి ప్రభుత్వ సమర్థవంత పాలనలో ప్రతిఒక్కరూ అన్ని మతాలను గౌరవిస్తూ ముందుకు సాగుతున్నారని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘు రామకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. ఆదివారం ఉండి మండలం, పెదపుల్లేరు గ్రామంలోని సత్తెమ్మ అమ్మవారి ఆలయం వద్ద విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నల్ల కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సహస్ర గళ హనుమాన్ పారాయణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని స్మరించుకోవడం అభినందనీయమని అన్నారు. సుమారు 2 వేల మంది మహిళల చేత సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణం మహా యజ్ఞాన్ని నిర్వహించిన నిర్వాహకులు కృష్ణప్రసాద్, విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పరంజ్యోతి ఆంజనేయులు, దంగేటి రామలింగేశ్వర రావులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, కలిదిండి నరసింహరాజు, కలిదిండి మురళీకృష్ణంరాజు, కలిదిండి రామకృష్ణంరాజు, కలిదిండి భాస్కరరాజు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్త నారాయణరెడ్డికి పరామర్శ


ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వాండ్రం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డిని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ నారాయణరెడ్డి తండ్రి ద్వారంపూడి అమ్మిరెడ్డి(87) ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. నారాయణరెడ్డి కుటుంబం త్వరగా కోలుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వారు సూచించారు. నారాయణరెడ్డిని పరామర్శించిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, పార్టీ గ్రామ అధ్యక్షులు కదులు బలరాం, నాయకులు కొత్తపల్లి నాగరాజు, పెన్మెత్స ఆంజనేయ రాజు ఉన్నారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.


వైఎస్ షర్మిలతో బుజ్జి

'కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి'

ప్రజాశక్తి - నరసాపురం


నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి సూచించినట్లు నరసాపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కానూరి ఉదయభాస్కర్ కృష్ణప్రసాద్(బుజ్జి) తెలిపారు. విజయవాడ ఆంధ్ర రత్నభవన్ వద్ద రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బుజ్జి హాజరయ్యారు. నియోజకవర్గంలోని పలు దీర్ఘకాలిక సమస్యలను షర్మిల దృష్టికి తీసుకెళ్లినట్లు బుజ్జి తెలిపారు. బుజ్జి వెంట కాంగ్రెస్ నాయకులు మల్లిపూడి శ్రీనివాస్, మోకా శ్రీనివాస్ ఉన్నారు.


డొంకలు,తుప్పలు తొలగించిన తర్వాత స్మశాన వాటిక

శ్మశానవాటిక ప్రక్షాళన

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పెద్ద పంచాయతీల్లో ఒకటైన యర్రంశెట్టిపాలెం గ్రామానికి చెందిన శ్మశానవాటిక డొంకలు, తుప్పలు, చెట్లతో చిట్టడవిని తలపించే విధంగా తయారైంది. దహన సంస్కారాలు చేసేందుకు కూడా గ్రామస్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం చర్యలు చేపట్టింది. గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ బాబులు శ్మశానవాటిక రూపు మార్చేందుకు చర్యలు చేపట్టి సుమారు రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న శ్మశానవాటికను గత కొన్ని రోజులుగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టారు. దీంతో శ్మశానవాటిక విశాలంగా రూపు మారింది. చిట్టడవిని తలపించే శ్మశాన వాటికను శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటిక ప్రక్షాళన పనులను గ్రామ సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ బాబు, ఉప సర్పంచి తెలగంశెట్టి శ్రీదేవి వాసు పర్యవేక్షించారు.


మాట్లాడుతున్న ప్రసాదరాజు

సాగునీటి సంఘాల ఎన్నికలపై చర్చ

ప్రజాశక్తి - నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లా వైసిపి అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో నరసాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నరసాపురం పార్లమెంటు ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సాగునీటి సంఘాల ఎన్నికలు, పట్టభద్రులకు ఓట్లు నమోదు, సంస్థాగతంగా పార్టీ నిర్మాణం, మండల కార్యకర్తల సమావేశాల నిర్వహణ, అంశాల మీద చర్చించినట్లు ప్రసాదరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజు, చాగంటి సత్యనారాయణ, దొంగ మురళీకృష్ణ, కర్రి ఏసు పాల్గొన్నారు.

వ్యక్తి హత్య

మొగల్తూరు : మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడీ గ్రామంలో శనివారం రాత్రి వ్యక్తి హత్యకు గురయ్యారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మారేళ్ల రాంబాబు(48) శనివారం తనలో తాను తిట్టుకుంటూ ఉండగా కొత్త కాయల తిప్ప గ్రామానికి చెందిన జడ్డు నాయుడు, ఉంగరాల వీరన్నలు దాడి చేసి కొట్టారు. తెల్లవారి చూసేసరికి రాంబాబు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. సంఘటనకు సంబంధించి రాంబాబు భార్య వెంకట కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసే దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రహదారుల ఆక్రమణ


రోడ్డుకిరువైపులా ఆక్రమించిన దుకాణాదారులు

పట్టించుకోని అధికారులు
మెయిన్ బజార్‌లో ట్రాఫిక్ జామ్
ప్రయాణికుల అవస్థలు

ప్రజాశక్తి - పెనుగొండ

రహదారులు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పెనుగొండ మేజర్ పంచాయతీలో కెనాల్, మెయిన్ బజార్ రోడ్లలో దుకాణాదారులు రహదారికి ఇరువైపులా ఆక్రమించడంతో రద్దీ పెరిగి ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా జాగా కనిపిస్తే చాలు ఆక్రమణకు గురవుతుంది. వ్యాపారస్తులు అమ్మే వస్తువులు రోడ్ల మీద అలంకరిస్తుంటే ట్రాఫిక్‌తో కొనుగోలుదారుడు ఎక్కడబడితే అక్కడ ద్విచక్రవాహనం నిలిపివేసి షాపింగ్ చేయడం, దీనికి తోడు యాక్సిడెంట్లకు నిలయంగా మారిందని స్థానికులు, ప్రయాణికులు వాపోతున్నారు. యువకులు ద్విచక్ర వాహనాలతో శబ్ద కాలుష్యం చేస్తూ ప్రయాణికులను, కాలిబాట నడిచే వాళ్లను హడలెత్తిస్తున్నారు. వ్యాపారస్తులు కొందరు రాజకీయ నాయకుల అండదండలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మండల వ్యవసాయాధికారిగా నాగరాజు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా, ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న బొమ్మిడి నాగరాజు మండల వ్యవసాయాధికారిగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఎంఎల్ఎ పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంఎల్ఎ పితాని నాగరాజును అభినందించారు. ఉద్యోగోన్నతిపై వ్యవసాయ విస్తరణాధికారిగా మండలానికి గుబ్బల నరేష్ కుమార్‌ను నియమించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్ బాబు, టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య, తమ్మినీడి ప్రసాద్, బీర నరసింహమూర్తిలు అభినందనలు తెలిపారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

వసతిగృహం వార్డెన్ చిటికెల మోహన్‌రావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దీపావళి అన్ని పండగలకంటే ఆనందదాయకమైనదని, బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలుర వసతిగృహం వార్డెన్ చిటికెల మోహన్‌రావు అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బాణాసంచా కాల్పుల జాగ్రత్తలపై నరసయ్య అగ్రహారంలోని బాలుర వసతిగృహంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. మోహన్‌రావు మాట్లాడుతూ కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు జరుగుతాయని, ప్రాణ, ఆస్తినష్టాలు జరుగుతాయన్నారు. అందువల్ల పిల్లలు కాల్చేటప్పుడు దగ్గర ఉండాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ దీపావళి రోజున బకెట్‌లో ఇసుక, నీళ్లు, పాత గోనెసంచి, పాత బట్టలు దగ్గర ఉంచుకోవాలని, ముఖానికి దగ్గరగా బాణాసంచా కాల్చవద్దని అన్నారు. అనంతరం హాస్టల్ విద్యార్థులకు టిడిపి నాయకులు విన్నకోట వినాయకరావు సహకారంతో 42 మందికి పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందుగుండు తయారీకి, విక్రయానికి అనుమతులు తప్పనిసరి

పట్టణ సిఐ బి.యాదగిరి

ప్రజాశక్తి - నరసాపురం

దీపావళి వేడుకలలో భాగంగా మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రాలు, నిల్వచేసే గోడౌన్లు, విక్రయించే దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని నరసాపురం పట్టణ సిఐ బి.యాదగిరి అన్నారు. ఆదివారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. రానున్న దీపావళి వేడుకలకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక తదితర శాఖల నిబంధనల ప్రకారం అనుమతులు పొంది జాగ్రత్తలను విధిగా పాటించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా బాణసంచా సామాగ్రి తయారీ నిల్వకేంద్రాల నివాసాలకు నిర్దేశించిన దూరంలో తప్పనిసరిగా ఉండాలన్నారు. అనుమతులు పొందిన షాపు యజమానులు జనసంచారం లేని చోట, విశాలమైన ఖాళీ ప్రదేశంలో విక్రయించుకోవాలన్నారు. జన



వాసాలకు, విద్యాసంస్థలకు, ఆలయాలకు, ఆసుపత్రులకు దూరంగా బాణసంచా నిల్వలు ఉండాలన్నారు. ప్రతి దుకాణం వద్ద ఫైర్ డిస్టింగేటర్లు, బకెట్లల్లో పొడి ఇసుక, నీరు అందుబాటులో ఉండాలన్నారు. లైసెన్సు లేకుండా మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ యాదగిరి హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు

విఎస్.రాజు సేవలు ఆదర్శం

ప్రజాశక్తి - కాళ్ల

వేంపాడు గ్రామానికి చెందిన ఐఐటి ప్రొఫెసర్ విఎస్‌రాజు 84 ఏళ్ల వయసులో ఇంకా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ.. అందరికీ ఆదర్శంగా ఉన్నారని ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. వేంపాడు గ్రామంలో స్వయం కృషి కిడ్స్ కేర్ సెంటర్‌లో ఐఐటి ప్రొఫెసర్ విఎస్.రాజు దంపతులకు సత్కార సభ ఆదివారం నిర్వహించారు. సత్కార సభలో ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ విఎస్.రాజు వేగేశ్న బంగారమ్మ ఫౌండేషన్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత 30 ఏళ్లుగా గ్రామంలో చిన్నారులకు స్వయం కృషి కిడ్స్ కేర్ సెంటర్‌ను, వృద్ధులకు పింఛన్లు అందించడం అంటే మంచి మనసు ఉన్న వారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. విఎస్.రాజు స్ఫూర్తితో మిగతా గ్రామాలు విద్య కోసం, ఆరోగ్యం కోసం ప్రాధాన్యత ఇచ్చే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పలు గీతాలు, కోలాటం, యోగ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఆర్.రాజు, డాక్టర్ గోపాలరాజు, డాక్టర్ రామకృష్ణంరాజు, డాక్టర్ వేగేశ్న రాజన్‌రాజు, రంగనాథరాజు, డాక్టర్ సోమరాజు పాల్గొన్నారు.

టిడిపిని బలోపేతం చేయాలి

ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

గ్రామాల్లో బూత్ స్థాయి నుంచి టిడిపిని బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరులో ఆచంట నియోజకవర్గం ముఖ్య నాయకుల, బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పితాని సత్యనారాయణ మాట్లాడుతూ సభ్యత్వ నమోదు చేసే కార్యకర్తలకు ఎన్నడూ లేని విధంగా ప్రమాదంలో మరణించిన వారికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ కల్పిస్తూ టిడిపి అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. అంతేకాకుండా సాధారణ మరణాలకు పదివేల రూపాయలు ఇచ్చే విధంగా టిడిపి ఎంఎల్ఏలు చంద్రబాబును కోరడం జరిగిందని దానికి అంగీకరించారని అన్నారు. సాధారణ సభ్యత్వాలు వంద రూపాయలు జీవిత కాలపు సభ్యత్వం లక్ష రూపాయలు వివరాలను ట్యాబ్ ద్వారా సెల్‌ఫోన్లో బూత్ కన్వీనర్లు వారి సహాయకులుగా ఉన్న పదిమంది వేగంగా నమోదు చేయాలని కోరారు. టిడిపి నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

మానవత్వంతో ఎదుటి వారికి సాయపడాలి

విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మానవత్వంతో సాటివారి పట్ల, ప్రకృతి పట్ల, పర్యావరణం పట్ల దయతో ఉండాలని మానవతా సంస్థ జిల్లా కార్యదర్శి, విశ్రాంత అధ్యాపకులు కొత్త సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం మానవత మండల యూనిట్ సమావేశం సంస్థ కార్యాలయంలో ఉపాధ్యక్షులు బండి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్థానిక సైకిల్ స్టోర్ యజమాని కర్రి కృష్ణారెడ్డి సంస్థకు లైఫ్ మెంబర్షిప్ రూ.25 వేలు ప్రకటించారు. మానవసేవే మాధవసేవ అంటే మనం ప్రజలకు సేవ చేయాలన్నారు. సంస్థ ఛైర్మన్ కడలి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కాలువలు, చెరువులు సంరక్షించుకోవాలని, పూర్వం ప్రజలు చెరువులు, కాలువలు, బావులలో నీరు తాగేవారని, అయితే నేటి ఆధునిక యుగంలో ప్లాస్టిక్ బాటిల్‌తో నీరు తాగుతున్నారని, ఇది దురదృష్టకరమని వాపోయారు. మానవ తప్పిదం వల్ల భవిష్యత్ తరాలు నీటి కాలుష్యంతో పాటు నీటి యుద్ధాలు కూడా జరుగుతాయని, కాబట్టి నీటి సంరక్షణ చేద్దామని పలువురు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోఛైర్మన్ పడాల జగన్నాథ్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ దొంగ జయ దుర్గారావు, కోణాల నర్సిరెడ్డి, అమృతవాకుల సత్యనారాయణ, విశ్వనాథం పాల్గొన్నారు.


పెనుమంట్ర : మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

తణుకు : మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సమావేశం ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామంలో మానవత కార్యాలయంలో అధ్యక్షులు కఠారి సిద్ధార్థరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తాడిపర్రు గ్రామ వాస్తవ్యులు దాత వాకలపూడి గణేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మానవత సేవలకు స్ఫూర్తిని పొంది మానవత శాంతిరథం నిమిత్తం రూ.10 వేల విరాళాల్ని అందజేశారు. మానవత మండల ఛైర్మన్ తాతిని కృష్ణారావు మానవత సేవలను వివరించారు. అనంతరం కాల్ధారి గ్రామానికి చెందిన గారపాటి నవ్య విద్యాభ్యాసం నిమిత్తం(డిగ్రీ) సంస్థ నుంచి రూ.5 వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వేలివెన్ను గ్రామ నివాసి దండమూరి రవీంద్ర వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న తాడిపర్రు గ్రామ నివాసి గ్రంధి పృధ్వీరాజుకు రూ.5 వేలు, బిల్డింగ్‌పై నుంచి పడి తీవ్ర గాయాలైన కార్మికుడు మోటుపల్లి ఆనంద్‌మనోహర్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు, పణతిని పార్వతి స్వయంగా రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ కన్వీనర్ ఎస్‌వి.సతీష్‌బాబు, సభ్యులు వెలిచేటి బోస్, సుంకవల్లి వెంకటేశ్వరరావు, కోడూరి ప్రసాద్, కోడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రదానం

పాలకొల్లు : జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టెస్ట్‌లో విజేతలు విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో అనేక రంగాలలో రాణించి, సమాజానికి సేవ చేయాలని పాలకొల్లు ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి, డాక్టర్ చల్లా మల్లిఖార్జున రావులు కోరారు. ఆదివారం పాలకొల్లు ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి టెస్ట్ విజేతలకు బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విజేతలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకుని, ప్రజలలో మూఢవిశ్వాసాలను పారద్రోలడానికి కృషిచేయాలని వారు కోరారు. మండల స్థాయిలో విజేతలై ఇక్కడ జిల్లా స్థాయిలో పాల్గొన్న వారందరినీ అభినందించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రామ లక్ష్మణరావు అధ్యక్షతన జిల్లా చెకుముకి కన్వీనర్ రేపాక వెంకన్న బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలలో జిల్లా వ్యాప్తంగా 34 టీంలు పాల్గొన్నాయి. చెకుముకి జిల్లాస్థాయి సైన్స్ సంబరాల్లో విజేతలుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో భీమవరం పిఎస్ఎం బాలికల హైస్కూల్‌కు ప్రథమ స్థానం, నక్కావారి పేట, నర్సాపురం మహాత్మ జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ బాలికల పాఠశాలకు ద్వితీయ స్థానం, దేవ(పెనుగొండ మండలం) ఎస్ఎంబిటిఆర్ జెడ్‌పి హైస్కూల్‌కు తృతీయ స్థానం పొందారు. ప్రయివేట్ పాఠశాలల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ స్థానం, పెదఅమిరం వెస్ట్ బెర్రీ హైస్కూల్ ద్వితీయ స్థానం, తాడేపల్లిగూడెం భాష్యం హైస్కూల్ తృతీయ స్థానం పొందారని జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు ప్రకటించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ముఖ్య అతిథులు చేతుల మీదుగా అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రథమ స్థానం పొందిన పిఎస్ఎమ్ బాలికల ఉన్నత పాఠశాల, భీమవరం విద్యార్థులు, మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఉల్లంపర్రు విద్యార్థులు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రజ్ఞుల చిత్రపటాలకు, అమరులైన జెవివి నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జెవివి ఉపాధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు నిర్వహించిన సైన్స్ మ్యాజిక్ షో అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎంఎంకెఎన్ఎం హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం పి.ధర్మారావు, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు ప్రత్తి వీరాస్వామి, జెవివి గౌరవ సలహాదారు పిజికె గోఖలే, జెవివి జిల్లా కోశాధికారి మల్లుల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు వై.అజయ్ కుమార్, జె.జయదుర్గారావు, ఎండి గణేశ్వర రావు, ఎంవి.గణేష్, అలుగు జాన్సన్, చైతన్య ప్రసాద్, కె.పెద్దిరాజు, ఆకెన రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు

సెంచరీకి చేరువలో కూరగాయల ధరలు
అల్లాడుతున్న సామాన్యులు

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్తీకమాసం రాకముందే కాయగూరల ధరలు మండిపోతున్నాయి. ఒక పక్క ఉష్ణోగ్రతలు పెరగడం, ఇటీవల వరదలు, అధిక వర్షాల నేపథ్యంలో ఉత్పత్తి తగ్గడంతో ధరలు దారుణంగా పెరుగుతున్నాయి. దాదాపు కాయగూరల ధరలు సెంచరీకి దగ్గర్లో ఉన్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అల్లాడుతున్నారు. మాంసాహార ధరలు కూడా పెరుగుతున్న నేపథ్యంలో అసలు ఏం కొనాలి, ఏం తినాలి అని ప్రజలు వాపోతున్నారు. ఒక పక్క బియ్యం, నిత్యావసర వస్తువుల ధరలు, పప్పుల ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. కనీసం ఉల్లిపాయల పులుసు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఉల్లి రైతుకు గిట్టుబాటు ధర లేకపోయినా మార్కెట్లో మాత్రం కర్నూలు రకం ధర రూ.40-50 మధ్యన ఉన్నాయి.



మహారాష్ట్ర ఉల్లిపాయలు రూ.50-80 మధ్యన ఉన్నాయి. ఇక టమోటా సామాన్యులకు అందని విధంగా కిలో రూ.60కు పైగా ఉంది.

టిడిపిలోకి పెదపుల్లేరు సర్పంచి


ఎంఎల్ఎ సమక్షంలో టిడిపిలోకి చేరిన సర్పంచి దంపతులు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు దంపతులు ఆదివారం టిడిపిలో చేరారు. మాజీ మంత్రి కలిదిండి రామచంద్రరాజు నివాసం వద్ద టిడిపి గ్రామ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు సమక్షంలో టిడిపిలో చేరగా పార్టీ కండువా వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కరణం పార్వతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు అభివృద్ధి పనులను చూసి తమ గ్రామాభివృద్ధికై టిడిపిలో చేరుతున్నామన్నారు. తనతో పాటు సుమారు 30 మంది టిడిపిలో చేరుతున్నారని, త్వరలో మరిన్ని చేరికలు ఉంటాయని అన్నారు. గ్రామ అభివృద్ధికి, పార్టీ అభివృద్ధికి తాము కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు, జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను పార్టీలకతీతంగా దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ప్రతిపక్ష సర్పంచులకు కనీసం విలువ ఇచ్చేది కాదని, కానీ నేడు పార్టీలకతీతంగా గ్రామ సర్పంచులకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెదపుల్లేరు గ్రామ ముఖ్య నాయకులు కలిదిండి శ్రీనివాస రాజు, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక చంద్రశేఖర్, నాగరాజు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, తోట శ్రీరాములు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లాలో అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా, ఎవరైనా అక్రమంగా టపాసులు నిల్వ ఉంచినా, విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి హెచ్చరించారు. ఈమేరకు ఆదివారం పలు సూచనలు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. బాణసంచా విక్రయించే తాత్కాలిక షాపులు పట్టణ, గ్రామ శివార్లలోని బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే ఏర్పాటు చేయాలన్నారు. అగ్నిప్రమాదాల నియంత్రణకు నిబంధనల ప్రకారం షాపు యజమానులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. షాపుల వద్ద నిబంధనలకు అనుగుణంగా సమృద్ధిగా నీరు, పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉండాలని, ప్రమాదాలకు తావులేకుండా, సరైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ టపాసులు విక్రయించాలని, నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. అనుమతులు పొందిన వారు కేటాయించిన ప్రదేశాలలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుని టపాసుల విక్రయాలు చేయాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామాగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల వద్ద సిద్ధంగా ఉంచుకోవాలని, లైసెన్స్‌లు కలిగిన దుకాణదారులు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా దీపావళి మందుగుండు సామాగ్రి కలిగి ఉన్నా, తయారు చేసినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. టపాసులు కాల్చే సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ 100 లేదా డయల్ 112కి గాని, లేదా సంబంధిత పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలియజేశారు. జిల్లాలోని టపాసుల విక్రయదారులు అందరూ నిబంధనలని తప్పక పాటించాలని కోరారు.


బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో బాలికల పోటీ

క్వార్టర్ ఫైనల్స్‌కు నాలుగు జట్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరులో జరుగుతున్న 68వ ఎపి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-17 బాలుర, బాలికల బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో ఆదివారం బాలికల విభాగంలో నాలుగు జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. ఈమేరకు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ పీడీ కర్రి కృష్ణారెడ్డి మాట్లాడుతూ అనంతపురం, తూర్పు గోదావరి, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల బాలికల జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు చేరినట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు, మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ ఛైర్మన్ మంతెన రామరాజు అన్నారు. ఆదివారం ఉండి గ్రామంలో 92 సంవత్సరాల చరిత్ర కలిగిన చిన్నవంతెన పునర్నిర్మాణ, రాధా మదనమోహన స్వామివారి మందిరం ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు, మంతెన రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.15 లక్షల ప్రభుత్వ నిధులతో ప్రతిష్టాత్మకంగా, ఎంతో నాణ్యంగా చిన్నవంతెన నిర్మించారన్నారు. ఆధ్యాత్మికత ప్రతిబింబించేలా స్వామివారి ప్రతిమలను అమర్చి ముఖద్వారం నిర్మించిన దాత నవుడు సురేష్‌కి అభినందనలు తెలియజేశారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలైన పంటకాలువల ప్రక్షాళన, మురుగు కాలువల ప్రక్షాళన, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వసతిగృహాల్లోని సమస్యలను పరిష్కరించామని అన్నారు. అనంతరం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ నియోజకవర్గంలో అవసరమైన రోడ్లన్నీ పునర్నిర్మించడం, మరమ్మతులు చేయడం వంటివి సంక్రాంతిలోగా పూర్తిచేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు నవుడు వెంకటరమణ, ఉండి గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉప సర్పంచి గొట్టిముక్కల కళ్యాణ వర్మ, టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ

CHANGE OF NAME

I **CHIKATLA RAJANI KANTH** S/o. Chikatla Nageswara rao, D.No. 7-12, Rupanthara Devalayam Street, Racharla, Pentapadu Mandal, West Godavari D.t, A.P., Pin No.534166. I have changed my name From **CHEEKATLA RAJNIKANTH** (Old Name and D.No.4-79) to **CHIKATLA RAJANIKANTH** (New Name and D. No. 7-12), hence forth I am being called Chikatla Rajanikanth S/o. Chikatla Nageswara rao. for all purposes